క్లుప్తంగా

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, అభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన చేశారు. సంతానం కలగాలని గిరికొండ చుట్టూ దంపతులు ప్రదక్షిణలు చేశారు. మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామికి నైవేద్యం చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కుబడులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

చాట్ జీపీటీపై నైపుణ్యం ఉండాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

తాళ్లూరు: ప్రతి ఒక్క విద్యార్థి చాట్ జీపీటీ, ఏఐ రంగాలపై నైపుణ్యం కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌కే ప్రసాద్ అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం హైస్కూల్లో ఒకేషనల్ ట్రైనర్ అంజిబాబు ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు శనివారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు సులువుగా వస్తాయని, ప్రతి ఒక్కరూ ఆసక్తిగా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనర్ డేవిడ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



తోపుడు బండి వ్యాపారిని హెచ్చరిస్తున్న సీఐ

యర్రగొండపాలెం: తోపుడు బండ్ల వ్యాపారులు, వాహనదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని సీఐ సీహెచ్ ప్రభాకరరావు ఆదేశించారు. ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి శనివారం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న బండ్లను దూరంగా జరిపించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సీఐ హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగి హెల్మెట్ ధరించి తమతో పాటు తమ కుటుంబాలను రక్షించుకోవాలని సీఐ ప్రభాకరరావు సూచించారు.

విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలి



మాట్లాడుతున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో ఇందిర సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ పాఠశాలలో కాంప్లెక్సు సమావేశాలు నిర్వహించారు. పీవీపల్లి కాంప్లెక్సులో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలకు గైర్హాజరైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు ప్రతి నెలలో చెప్పిన సిలబస్‌ను రివిజన్ చేసుకుంటూ విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతిలో బోధించాలని సూచించారు. అకడమిక్ క్యాలెండర్‌ను తప్పని సరిగా ఉపాధ్యాయులంతా అనుసరించాలని ఎంఈవో ఇందిర సూచించారు.



మెయిన్ రోడ్డుపై మురుగు



పైపు పగిలి వృథాగా పోతున్న తాగునీరు

మంచంపట్టిన దేవరాజుగట్టు

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు మంచం పట్టింది. ప్రజలు జ్వరాలతో అల్లాడిపోతున్నారు. పారిశుధ్యం లోపించడంతో జ్వరపీడితులు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో 60 గృహాలు ఉన్నాయి. దాదాపు 15 రోజుల నుంచి ఇంటికి ఇద్దరు చొప్పున జ్వరాలతో బాధపడుతున్నారు. పెద్దారవీడు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం వెళ్తే వైద్య సిబ్బంది సక్రమంగా పట్టించుకోవడం లేదని, ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు లేవని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కటికల విశ్రాంతమ్మ, కటికల పెద్దకాశయ్య, మరో 20 మంది జ్వరాలతో మంచాన పడ్డారు. దీంతో మార్కాపురంలోని ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించి వేలకు వేలు ఖర్చు చేసుకుంటున్నారు. సిమెంటు రోడ్లకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షం నీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కాలనీలో సిమెంట్ రోడ్లకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలువలు లేక మురుగు నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇంటి ముందు మురుగు నిల్వ ఉండటంతో



టైఫాయిడ్‌తో బాధపడుతున్న కటికల విశ్రాంతమ్మ



కటికల పెద్ద కాశయ్య..

దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికే ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మురుగు ఉన్న ప్రదేశాల్లో ఎలాంటి బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖాలాలు కనిపించడం లేదు. రోడ్లపై మురుగు గురించి పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది కాలనీ పరిస్థితి. రోడ్లపై మురుగు నీరు పారుతున్నా, చెత్త కుప్పలు పేరుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగు నిల్వ లేకుండా, వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు:



రోడ్లపై మురుగు పారుతోంది. పైపు పగిలి తాగునీరు వృథాగా పోతున్నాయి. సమస్యల గురించి పంచాయతీ అధికారికి అర్జీలు ఇచ్చినా, పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇంటి ముందు మురుగు నిల్వ ఉండటంతో దోమలు చేరుతున్నాయి. మా బజారులో దోమలు కుట్టడంతో జ్వరాల బారిన పడి కొందరు మంచంలో ఉన్నారు. పైపుల ద్వారా వచ్చే మురుగు నీటిని తప్పని పరిస్థితిలో తాగుతున్నాం. కలుషిత నీటిని తాగడంతో జ్వరాలు వస్తున్నాయి. సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కటికల శాంతమ్మ, గృహిణి, దేవరాజుగట్టు

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

పెద్దారవీడు: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ జగదీష్ అన్నారు. మండలంలోని పుచ్చకాయలపల్లి సచివాలయంలో సర్పంచ్ వజ్రాల రామలక్ష్మమ్మ ఆధ్యక్షతన స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మాతా శిశు సంరక్షణ కోసం తీసుకోవాల్సిన ఆగ్రత్తలు, క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు, క్యాన్సర్, చెవి, ముక్కు, గొంతు, కంటి పరీక్షలు చేయించుకొని ఆరోగ్యవంత సమాజాన్ని స్థాపించడమే ధ్యేయంగా అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. గర్భిణులకు రక్త పరీక్షలు చేసి ఐరన్ మాత్రలు అందజేశారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు మారంరెడ్డి రామస్వామిరెడ్డి, యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.



కురిచేడు: పొట్లపాడులో..



పెద్దారవీడు: మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

దొనకొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థ నారి– స్వశక్త్ పరివార్ అభియాన్‌పై సిబ్బందికి వైద్యాధికారి చంద్రమౌళి అవగాహన కల్పించారు. అక్టోబర్ 2 వరకు ఈ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు.

కురిచేడు: స్వస్థ నారీ సశక్త పరివార్ కార్యక్రమంలో భాగంగా శనివారం పొట్లపాడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వైద్యాధికారి ఎం.సుస్మితరెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 108 మంది మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని, ఏ అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని తెలిపారు. అనంతరం ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి వయో వందన యోజన కార్డులు నమోదు చేయించారు.

జగనన్న రాజ్యం మళ్లీ రావాలి



గంగదొనకొండలో క్యూఆర్ కోడ్ చూపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కురిచేడు: రెడ్‌బుక్ అరాచక పాలన పోయి జగనన్న రాజ్యం మళ్లీ తెచ్చుకొనేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. మండలంలోని బయ్యవరం, పెద్దవరం గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి షేక్ సైదా, నియోజకవర్గ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మేరువ సుబ్బారెడ్డి, కర్నాటి వెంకటరెడ్డి, గోదల సుబ్బారెడ్డి, కసిబిసి వెంకటేశ్వర్లు, ఆసుపల్లి చెన్నారెడ్డి, పుల్లారెడ్డి, భాస్కరరెడ్డి, గండి గంగయ్య, ఏసురత్నం, గండి శాంతారావు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

యర్రగొండపాలెం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం ట్రై సైకిళ్లు పంపిణీ చేయించారు. ఆయన తన నియోజకవర్గంలో పర్యటిస్తున్న సందర్భంగా మండలంలోని వాదంపల్లి గ్రామానికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన మాగులూరి ప్రభావతి తమకు ట్రై సైకిళ్లు అవసరమని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన డిసేబుల్ అండ్ వెల్ఫేర్ నిధులతో ట్రై సైకిళ్లు తెప్పించి వారికి అందజేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఏకుల మునలారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, వివిధ విభాగాల నాయకులు సయ్యద్ జబీవుల్లా, షేక్ మహ్మద్ ఖాసిం, పబ్బిశెట్టి శ్రీనివాసులు, బి.బాలచెన్నయ్య, సూరె ప్రసాద్, ఆవుల వీరకోటిరెడ్డి, ఆవుల రమణారెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, సింగా ప్రసాద్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల బంద్‌కు కలసి రావాలి

దర్శి: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో నెలకొన్న అనేక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22వ తేదీ నుంచి కళాశాలల బంద్ ప్రకటిస్తున్నట్లు ఏపీపీడీసీఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరాజు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కనుమర్ల గుండారెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది వరకే ప్రభుత్వానికి పలు విధాలుగా తమ సమస్యలపై విజ్ఞప్తి చేసినా ఎటువంటి స్పందన లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టే మహా సంగ్రామంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి డిగ్రీ కాలేజీ యాజమాన్యం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులు క్రాప్ హాలిడే పాటించాలి



మహాసభకు హాజరైన రైతు నాయకులు

పెద్దదోర్నాల: ఉత్పత్తులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించని పక్షంలో రైతులే క్రాప్ హాలిడే పాటించాలని రైతు సంఘ జిల్లా నాయకులు జయంతిబాబు, పమిడి వెంకట్రావు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని శివసదనంలో శనివారం రైతు సంఘ మండల రెండో మహాసభ నిర్వహించారు. నుసుళ్లపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో జయంతిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో కార్పొరేట్ అనుకూల విధానాలు పాటిస్తూ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా అడ్డుకుంటున్నాయని విమర్శించారు. నరేంద్రమోదీ పాలనలో లక్షా 40 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ప్రభుత్వ రంగంలోని యూరియా ఉత్పత్తి పరిశ్రమలు మూసి వేయడంతో దేశంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు మొదటి సొరంగం ద్వారా నీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నుసుళ్లపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శిగా దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, కమిటీ సభ్యులుగా వెన్నా శ్రీనివాసరెడ్డి, వెన్నా వెంకటరామిరెడ్డి, దండా సత్యనారాయణరెడ్డి, బాబుసా, వెన్నా వెంకిరెడ్డి, ఏలూరి నాగయ్య, వెన్నా బ్రహ్మానందరెడ్డి, నాగిరెడ్డి, దుగ్గెంపూడి గోపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్య శక్తివంతమైన ఆయుధం

పెద్దారవీడు: విద్య శక్తివంతమైన ఆయుధమని, దాన్ని విద్యార్థులకు అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ– 2 ఎస్‌వీసీహెచ్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలకు ఉపాధ్యాయులు సక్రమంగా హాజరు కావాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. స్థానిక పాఠశాలలను సందర్శించి రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, నోడల్ ఆఫీసర్ సరేనాయక్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరెడ్డి

వైఎస్సార్ సీపీ నేతలకు అభినందనలు



నాయకులను సన్మానిస్తున్న ముసలారెడ్డి

యర్రగొండపాలెం: స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ క్యాంప్ కార్యాలయంలో మండలంలోని కొలుకుల గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తుల ఆంజనేయులు, రైతు విభాగం అధ్యక్షుడు మందా ఆశీర్వాదాన్ని ఆ పార్టీ మండల కమిటీ అభినందించింది. శనివారం వారు పార్టీ మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆంజనేయులు, ఆశీర్వాదాన్ని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రచార విభాగం నాయకుడు చెంగళ నాగయ్య పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌కు సాయం



ఏసోబుకు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన ఏసోబుకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, బి.రమాదేవి అన్నారు. ఏపీటీఎఫ్ దర్శి మండల శాఖ తరఫున జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తూము శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నక్కా కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో రూ.30 వేల ఆర్థిక సాయం శనివారం అందజేశారు. ఆ సాయాన్ని ఉపాధ్యాయులు వాకా జనార్దన్‌రెడ్డి, తూము శ్రీనివాసరావు, నక్కా కోటేశ్వరరావు, సందు వెంకటేశ్వర్లు, అమరా శ్రీనివాసులు, బండారు వెంకటేశ్వర్లు, ఓ.బాషా, బోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పాణెం నజీర్, అల్లు రమణారెడ్డి, నేరెళ్ల జాన్, గుడిమెట్ల రంగస్వామి, నారాయణ, మెట్టిల సాంబయ్య, రమణయ్య, కొమ్ము రమేష్, ఏతు మాణిక్యం, బేతపూడి లింగారావు, పఠాన్ యాసిన్, తోట శ్రీలక్ష్మమ్మ, మంజుల, చీరాల అనిత, కట్టా హరిప్రసాద్, నరసింహం, వెంకటాచలం, ఆనాల సుబ్బారావు, పుణ్యవతి, చిరంజీవి, ఎ.సులోచన, షాహినా బేగం, నారాయణ, పద్మావతి తదితరులు అందించారు. ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయులకు ఏసోబు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు గాలికుంటు టీకా వేస్తున్న జేడీ రవికుమార్

కురిచేడు: పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పడమర గంగవరం, కల్లూరు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని పడమర గంగవరం, దొనకొండ మండలం పెద్దన్నపాలెం గ్రామాల్లో కూడా ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లోని పశుపోషకులతో మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాల ప్రాముఖ్యతను, వాటి ఉపయోగాలు వివరించారు. అనంతరం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో వైద్య సిబ్బందికి జేడీ తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

సిబ్బంది నియామకానికి చర్యలు: జేడీ

ఈ సందర్భంగా జేడీ రవి మాట్లాడుతూ స్థానిక పశువైద్యశాలలో ఒక ఏడీ, ఒక వైద్యాధికారి ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేకపోవటం ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. త్వరలో ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 1962 అత్యవసర వైద్యసేవల వాహనానికి సంబంధించి సమయాల్లో మార్పులు చేసేలా ప్రయత్నిస్తానని తెలిపారు. అత్యవసర వాహనం 24 గంటలూ పనిచేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని పశుపోషకులకు జేడీ రవి భరోసా ఇచ్చారు. మండలంలో మరో రెండు పశువైద్య ఉప కేంద్రాలు ఏర్పాటుపై త్వరలో సరైన నిర్ణయం తీసుకుంటామని వివరించారు. పశువైద్యశాలల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఇన్‌చార్జి వైద్యాధికారి జె.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

దర్శి: గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణంలోని అద్దంకి రోడ్డులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాటర్ ప్లాంట్‌లో పని చేసే ఆర్.చిరంజీవి రోడ్డుపై వెళ్తుండగా గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



గాయపడిన చిరంజీవి